క్లుప్తంగా

ఠాగూర్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి పౌర గ్రంథాలయ శాఖ విశ్రాంత డైరెక్టర్ పాలపర్తి ప్రభాకరరావు పుస్తకాలు బహూకరించారు. ఠాగూర్ గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తన వద్ద ఉన్న అంబేడ్కర్ జీవిత చరిత్ర, ఇంగ్లిష్ నిఘంటువు, మరికొన్ని పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. గ్రంథాలయంలో అన్ని విభాగాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయనను గ్రంథాలయ అధికారి రమాదేవి సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథ పాలకులు మస్తాన్ ఖాన్, వెంకటేశ్వరరావు, సిబ్బంది వై.ధనలక్ష్మి, జే శంకర్ పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. మంగళవారం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి సిందూరం, ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని 30 డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి సూచించారు. స్థానిక 30వ డివిజన్ దేవీనగర్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో ఆధునాతన వైద్య పరికరాలతో ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రం సేవలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఆరోగ్య కేంద్రం సేవలను విస్తృతం చేసేందుకు ఆశ, వలంటీర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు, కార్యక్రమంలో వార్డు సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు అమృతం



మధురానగర్(విజయవాడసెంట్రల్): తల్లి పాలు బిడ్డకు అమృతమని గులామొహిద్దీన్‌నగర్ ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్‌కే ఆయేషా అన్నారు. స్థానిక వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లీ బిడ్డకు ఇవ్వగలిగిన ఆరోగ్యం తల్లిపాలు మాత్రమేనన్నారు. పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. తల్లి పాల వల్ల చిన్నారులకు ఇన్ఫెక్షన్లు, డయేరియా, వాంతుల వంటి సమస్యలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని చెప్పారు. ఊబకాయం, ఇతర అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. అదే విధంగా తల్లికి బ్రెస్ట్, అండాశయ క్యాన్సర్లు రావని తెలిపారు. తల్లి పాలపై అపోహలు వీడి ప్రతి తల్లి బిడ్డకు కచ్చితంగా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ దాసరి ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

బైక్ ఢీ కొని వృద్ధురాలికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొనడంతో వృద్ధురాలు గాయాలబారిన పడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చల్లపల్లి బంగ్లా ప్రాంతానికి చెందిన గుడిపాటి లక్ష్మీరత్నం(74) సోమవారం రాత్రి ఏలూరు రోడ్డు గుణదల సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా పడవల రేవు వైపు నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన లక్ష్మీరత్నంను 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి ముంగిటకే పింఛను కానుక

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ
- లబ్ధిదారుల్లో వెల్లువెత్తిన ఆనందం



62వ డివిజన్‌లో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇంటి ముంగిటకే ఠంచన్‌గా పింఛన్ పంపిణీ చేస్తున్నామని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఒకటో తేదీ కావడంతో మంగళవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి నగదును అందజేశారు. 62వ డివిజన్ ఎల్బీఎస్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మితో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ..సామాజిక భద్రత పెన్షన్లు అందించడంలో దేశంలో ఏ రాష్ట్రం కూడా ఆంధ్రప్రదేశ్‌కు దీటుగా రాలేదన్నారు. పింఛన్‌దారులకు రూ.2,750 చొప్పున అందిస్తుండటంతో అవ్వాతాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తుందని చెప్పారు. అలాగే పింఛన్ అర్హతను 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో కేవలం 39 లక్షల మందికి మాత్రమే పెన్షన్లు ఇచ్చిందని, ఈ ప్రభుత్వంలో 63 లక్షల మందికి అందిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం నెలకు రూ.1,735 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు.

సీఎంను నిండు మనస్సుతో ఆశీర్వాదించాలి

సెంట్రల్ నియోజకవర్గంలోనూ టీడీపీ హయాంలో 18 వేలు మాత్రమే ఉన్న పింఛన్లను ఈ ప్రభుత్వంలో 25,326కు పెంచామని ఎమ్మెల్యే విష్ణు చెప్పారు. ఇందుకోసం ప్రతి నెలా 7 కోట్ల 8 లక్షల 71 వేల 250 రూపాయలు పింఛన్ రూపంలో అందిస్తున్నామన్నారు. తెలుగుదేశం హయాంలో 10 రోజులు పడిగాపులు కాస్తే తప్ప పింఛన్ డబ్బులు చేతికి అందేవి కాదని, ఈ ప్రభుత్వంలో లబ్ధిదారులు ఉన్నచోటుకే పింఛన్ అందించే విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. తొలి రోజునే 90 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేస్తున్నామన్నారు. సామాజిక పింఛన్లను రికార్డు స్థాయికి చేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు నిండుమనసుతో ఆశీర్వాదించాలని కోరారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, నాయకులు అలంపూరు విజయ్, వీరబాబు, రామిరెడ్డి, మస్తాన్, బోరాబుజ్జి, వెంకట్, పి.శ్రీనివాస్, సాంబయ్య, సుభాన్, రెడ్డమ్మ, వీరంకి నాగేశ్వరరావు, మహేష్, శివపార్వతి, గ్రేసీ, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

64వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): 64వ డివిజన్‌లో కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ లబ్ధిదారులకు మంగళవారం పింఛన్లు అందజేశారు. కెకె అపార్టుమెంటు వద్ద లబ్ధిదారులకు తిరుపతమ్మ వలంటీర్లతో కలిసి పింఛన్లు అందచేశారు.

కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో మొత్తం 1,920 మంది లబ్ధిదారులుండగా వారికి 53 లక్షల 36 వేల రూపాయలను ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు, గృహ సారథులతో పాటు పార్టీ నాయకులు జిల్లెల శివశంకర్, చేబ్రోలు శేఖర్, చెక్కా నరసింహారావు, రావి విమల, గొర్తిపర్తి వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ పేషెంట్‌కు పింఛన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఠంచన్‌గా ఒకటో తేదీ మంగళవారం పింఛన్ దారులకు వలంటీర్లు తలుపుతట్టి పింఛన్ పంపిణీ చేశారు. మధురానగర్‌కు చెందిన డయాలసిస్ పేషెంట్ షేక్ హసీనాకు వలంటీర్ సంధ్యారాణి రూ.10వేలు పింఛన్ అందజేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

పేదల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే విష్ణు



ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, నాయకులు

పాయకాపురం(విజయవాడరూరల్): పేదల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 62వ డివిజన్ 271వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎల్బీఎస్ నగర్‌లో 206 గడపలను సందర్శించారు. ప్రతి ఇంటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న పథకాలను వివరించారు. తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. పార్టీలకతీతంగా ప్రతి పథకం అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో దోచుకోవడం, పేదల సొమ్ము తినేయడమే పనిగా పెట్టుకుని పాలన సాగించారని విష్ణు విమర్శించారు.

ఇంటి వద్దకే రేషన్ దేశానికే ఆదర్శం

దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే రేషన్ సరుకులు డోర్ డెలివరీ విధానం ద్వారా ప్రజల గుమ్మం వద్దకు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. పర్యటనలో భాగంగా రేషన్ పంపిణీ వ్యవస్థను ఆయన పరిశీలించారు. రాష్ట్రంలో బీపీఎల్‌కు దిగువన కోటి 54 లక్షల కుటుంబాలు ఉంటే, 89 లక్షల కార్డుదారులకు మాత్రమే కేంద్రం బియ్యం కేటాయిస్తోందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 56 లక్షల కార్డుదారులకు బియ్యం అందిస్తోందన్నారు. ఏపీ రాష్ట్ర అప్పులపై పచ్చనేతలు, ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారం అంతా పచ్చి బూటకమని కేంద్రం ఇచ్చిన సమాధానంతో తేలిపోయిందని ఎమ్మెల్యే అన్నారు. లోక్‌సభ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానం ప్రతిపక్షాలకు చెంపపెట్టు అని పేర్కొన్నారు. డీబీటీ ద్వారా అక్షరాల రెండున్నర లక్షల కోట్ల రూపాయల నిధులను నాలుగేళ్లలో నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాలలో జమ చేసినట్లు వివరించారు. మరో వైపు తెలుగుదేశం నాయకుల మాటలు కోటలు దాటుతున్నా, సభలు మాత్రం వెలవెల బోతున్నాయని విష్ణు ఎద్దేవా చేశారు. టీడీపీ నేత నారా లోకేష్ చేస్తున్న యువగళమే ఇందుకు నిదర్శనమన్నారు. లోకేష్ ఒక అవుట్ డేటెడ్ నాయకుడని, యువగళం ఒక అట్టర్‌ఫ్లాప్ షో అని విమర్శించారు. గత ఎన్నికల్లో 23 స్థానాలకు పరిమితమైన తెలుగుదేశం పార్టీ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో జీరోకి పరిమితం కావడం ఖాయమన్నారు. డీఈ గురునాథ్, ఆర్ఐ శరత్, సీడీఓ జగదీశ్వరి, నాయకులు అలంపూరు విజయ్, డివిజన్ కోఆర్డినేటర్ కె.వీరబాబు, రామిరెడ్డి, మస్తాన్, బుజ్జి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేను సకాలంలో పూర్తి చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ఓటర్ల సర్వేను సకాలంలో, నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారికి మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. అజిత్ సింగ్‌నగర్, 60వ డివిజన్ వాంబేకాలనీలోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న బీఎల్వో(బూత్ లెవల్ ఆఫీసర్లు)లతో కలిసి ఓటర్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బీఎల్వోలు ప్రతి ఇంటింటికీ వెళ్లి ఇంట్లో వారి ఓటర్ల వివరాలను ఓటర్ల లిస్ట్‌తో సరి చూసుకోవాలని, 18 సంవత్సరాలు నిండిన వాళ్లుంటే వారికి ఓటును నమోదు చేయాలన్నారు. అదే ఇంట్లో ఎవరైనా చనిపోతే సంబంధిత కుటుంబీకుల నుంచి దరఖాస్తు చేయించి, చనిపోయిన వారి ఓటును తొలగించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న డోర్ నంబర్ నుంచి ఎవరైన స్థలం మారినా, ఆ ఓటర్ విజ్ఞప్తి మేరకు దరఖాస్తును మార్పించాలన్నారు. ప్రతి ఓటర్ బూతులో 1,500 ఓట్లు మించితే పక్క ఓటర్ బూతుకు మార్చేలా ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఒకే డోర్ నంబర్‌పై పదుల సంఖ్యలో నమోదైన ఓటర్లు ఉంటే, వాటినన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి, సరైనవేనని ఆధారాలతో సరిపోల్చుకోవాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు వస్తే పై స్థాయి అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని, ఓటర్ల నమోదులో గాని, తీసి వేయడంలో గాని అవకతవకలు జరిగితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. మున్సిపల్ అధికారులు, బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లంఘనులకు రూ.7,280 జరిమానా



మొబైల్ కోర్టులో నిందితుడిని విచారిస్తున్న న్యాయమూర్తి విజయ్‌కుమార్

పటమట(విజయవాడతూర్పు): నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని కార్పొరేషన్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి వి.విజయ్‌కుమార్ తెలిపారు. ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా మంగళవారం సత్యనారాయణపురంలోని సర్కిల్-2 ఆఫీసులో మొబైల్ కోర్టు నిర్వహించారు. రోడ్లపై, డ్రెయిన్లలో చెత్త వేసే వాళ్లు, రోడ్లపై రాకపోకలకు అవరోధం కలిగేలా జంతువులను కట్టేసేవాళ్లు, లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న 24 మందిపై నమోదైన కేసులను ఆయన విచారించారు. ఆయా కేసుల్లో నిందితులకు రూ.7,280 అపరాధ రుసుం విధించారు. నిందితులు మరోసారి నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జోనల్ కమిషనర్-2, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించాలి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కలు నాటడాన్ని ప్రతి పౌరుడు తన సామాజిక బాధ్యతగా భావించాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 58వ డివిజన్ తోటవారివీధిలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి మొక్కలు నాటారు. మానవాళి మనుగడ పచ్చదనం పరిఢవిల్లితేనే సాధ్యమవుతుందన్న విషయాన్ని బాధ్యత గల పౌరులందరూ గ్రహించాలని కోరారు. ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మానవ మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి రాష్ట్రాన్ని గ్రీన్ ఏపీగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలగంగాధర్ తిలక్ ఆశయ సాధనకు కృషి

మధురానగర్(విజయవాడసెంట్రల్): భారత జాతీయోద్యమంలో బాలగంగాధర్ తిలక్ పాత్ర నిరుపమానమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. స్థానిక ముత్యాలంపాడులో మంగళవారం ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు బాలగంగాధర తిలక్ 103వ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తిలక్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, నాయకులు దాసం దుర్గారావు, దేవల్ల అశోక్, కె.ఫణికుమార్, ఎస్‌కే రబ్బాని, ఎస్.వరాలు పాల్గొన్నారు

ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి పరికరాల అందజేత



ట్రాఫిక్ సిబ్బందికి పరికరాలను అందజేస్తున్న సీపీ టీకే రాణా, కృష్ణా ఎస్పీ జాషువా తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు తమ వంతు బాధ్యతగా హైదరాబాద్‌కు చెందిన ఎస్ఆర్ మీడియా సహకారంతో బీఎస్ఆర్ జ్యువెలరీ సంస్థ స్వచ్ఛందంగా తయారు చేసి బహూకరించిన ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను పోలీస్ కమిషనర్ టి.కె. రాణా ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి మంగళవారం అందజేశారు. వాటిల్లో రేడియం జాకెట్స్, ఎల్ఈడీ బాటన్స్, వీల్ లాక్స్, రెయిన్ కోట్స్, ట్రాఫిక్ కోన్‌లు, సోలార్ బ్లింకర్ స్టాపర్స్ తదితర పరికరాలు ఉన్నాయి. ఈ సందర్భంగా సీపీ రాణా హర్షం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా గతంలో కొత్తగా పరికరాలను కొనుగోలు చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, నగరంలో హెల్మెట్‌పై అవగాహన కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమైన జంక్షన్స్‌లో రేడియం స్టిక్కర్స్‌తో పాటు ప్రత్యేకంగా సోలార్ బ్లింకర్ స్టాపర్స్ ఏర్పాటు చేయడం వలన రాత్రి సమయాల్లో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఎస్పీ పి.జాషువా, డీసీపీ మోకా సత్తిబాబు, ఏడీసీపీలు ప్రసాద్, సీహెచ్ లక్ష్మీపతి, ట్రాఫిక్ ఏసీపీ జె వెంకట నారాయణ, బీఎస్ఆర్ మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ చరణ్ రెడ్డి, ఎస్ఆర్ మీడియా మేనేజింగ్ డైరెక్టర్ వి.సత్యారెడ్డి, పలువురు ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబా సేవలో లిడ్‌క్యాప్ చైర్మన్ రాజశేఖర్



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీగా విరాజిల్లుతున్న ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబాను దర్శించుకోవటం ఆనందంగా ఉందని లిడ్‌క్యాప్ చైర్మన్ కె.రాజశేఖర్ అన్నారు. స్థానిక ముత్యాలంపాడులోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో మంగళవారం సాయంత్రం బాబాను దర్శించుకుని పూజలు చేశారు. మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మందిరంలో నిర్వహిస్తున్న సేవలను తెలియజేశారు. అనంతరం ఆలయ అర్చకులు బాబాకు ప్రత్యేక పూజలు చేసి బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో రాజశేఖర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్య శ్రీహరి పాల్గొన్నారు.

● మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గ్రామదేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవాలయంలో మంగళవారం శ్రావణమాసం పూర్ణిమ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్వర్ణకవచంతో దుర్గమ్మ దర్శనం



శాప్ చైర్మన్ సిద్ధార్థ్‌రెడ్డి, పేర్ని కిట్టుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ మంగళవారం స్వర్ణకవచంతో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి పౌర్ణమికి అమ్మవారిని స్వర్ణ కవచంతో అలంకరిస్తారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రముఖులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చనలో పాల్గొన్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు నిర్వహించిన పూజలో మంత్రి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ(శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి, కృష్ణా, వైఎస్సార్ సీపీ గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అమ్మవారిని దర్శించుకున్నారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి చండీహోమంలో పాల్గొని పూజలు జరిపించుకొన్నారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. బ్రో హీరో సాయిధరమ్ తేజ్, చిత్ర దర్శకుడు సముద్రఖని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రముఖులకు వేద పండితుల ఆశీర్వచనం అందజేయగా, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, దుర్గగుడి డీఈవో గురుప్రసాద్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. దుర్గగుడి పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

మహిళా పోలీసు ఉద్యోగులకు అండగా ప్రభుత్వం



ఎమ్మెల్సీ రుహుల్లాకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ మహిళా పోలీసు ఉద్యోగులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సచివాలయ మహిళా పోలీసు ఉద్యోగులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. సచివాలయ మహిళా పోలీసు అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్సీను సింగ్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిశారు. సచివాలయ మహిళా పోలీసు ఉద్యోగులపై పడుతున్న పనిభారాన్ని తగ్గించడంతో పాటుగా వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్సీ రుహుల్లాకు వినతి పత్రాన్ని అందజేశారు. వారి సమస్యలు ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో ఉన్నాయని, అతిత్వరలోనే ఈ సమస్యలన్నిటికి ప్రభుత్వం పరిష్కారం చూపుతుందన్నారు. అసోసియేషన్ నాయకులు సురేఖ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో పతకాలను సాధించిన ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులను డెప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్ గున్ని అభినందించారు. గుంటూరు జిల్లా హిందూ ఫార్మసీ కళాశాలలో గత నెలలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి కర్రసాము(సిలంబం) పోటీల్లో కోచ్ సత్య శ్రీకాంత్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 22 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వయసులవారీగా, వివిధ విభాగాలలో పాల్గొన్న వారు 14 స్వర్ణ పతకాలు, 9 వెండి పతకాలు, 9 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు డీసీపీ విశాల్ గున్ని మంగళవారం కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలను గెలుచుకుని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కోచ్ సత్య శ్రీకాంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్లు అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): భానునగర్ అంగన్‌వాడీ కేంద్రానికి డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన మంగళవారం రెండు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ మాట్లాడుతూ.. భానూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్లు లేక గర్భిణులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారన్నారు. దీంతో తమ వంతు బాధ్యతగా ఫ్యాన్లు అందజేస్తున్నామని తెలిపారు. సొసైటీ సభ్యులకు అంగన్‌వాడీ టీచర్ తిరుపతమ్మ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుర్రం ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, గీతాంజలి, ఎం.రాము, అంగన్‌వాడీ కేంద్ర సహాయకురాలు దుర్గా తదితరులు పాల్గొన్నారు. మాతృదేవోభవ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన గౌరీశంకర్ సహకారంతో అన్నదానం నిర్వహించారు.